ప్రజాశక్తి

గురువారం 20 ఏప్రిల్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ఉయ్యూరు మండలం కాటూరు, నందివాడ మండలం జొన్నపాడులో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు

'ఉపాధి'కి కేంద్రం తూట్లు

- సైకిల్ యాత్రల్లో నేతల విమర్శ
- కృష్ణాజిల్లాలో ఉపాధి, భూమి, ఇళ్ల సమస్యలపై ముగిసిన మూడు యాత్రలు

ప్రజాశక్తి - ఉయ్యూరు, కోడూరు, గుడివాడ : కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తోందని పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులకు అంచలంచెలుగా బడ్జెట్లో నిధులను కుదిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ కార్మికులు పని ప్రదేశాల్లో కనీసం మంచినీళ్లు సౌకర్యం కూడా కల్పించడంలేదన్నారు. ఉపాధి, భూమి, ఇళ్ల సాధనకు, గ్రామీణ పేదల సమస్యల పరిష్కారానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 నుండి 5 రోజులపాటు కష్ణా జిల్లాలో సాగిన మూడు సైకిల్ యాత్రలు బుధవారం ముగిశాయి. ఈమూడు సైకిల్ యాత్రా దళాలు 14న ఉదయం మచిలీపట్నంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బయలుదేరాయి. మొదటి యాత్ర బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరు, గుడివాడ మీదుగా నందివాడ మండలం జొన్నపాడు, బుడమేరు వంతెన, పుట్టగుంట మీదుగా నందివాడ చేరుకుంది. అలాగే రెండో యాత్ర మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ మీదుగా కోడూరు చేరుకుంది. మూడో యాత్ర పామర్రు, పమిడిముక్కల, తోట్లవల్లూరు, కంకిపాడు, ఉయ్యూరు మీదుగా పెదపారుపూడి మండలం వెంట్రప్రగడలో ముగిసింది. రోజుకు ఐదు గ్రామాల చొప్పున మూడు బృందాలు ప్రతి రోజూ 15 గ్రామాల్లో పర్యటించాయి. ఈ యాత్రల్లో ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి నేతలు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ యాత్రల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, మద్దతుగా పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు (వైవి), వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శీలం నారాయణరావు, మురాల రాజేష్, ఉపాధ్యక్షులు ఆర్.రఘు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను రెండు వందల రోజులకు పెంచాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలి, ఉపాధి హామీ పనులకు కేంద్ర బడ్జెట్‌లో రూ.1.60 లక్షల కోట్లు కేటాయించాలని, ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మే 19న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉయ్యూరు మండలం కాటూరు, ముదునూరు మీదుగా పెదపారుపూడి (మిగతా 6లో)

కోడూరులో జరిగిన సైకిల్ యాత్రలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు శీలం నారాయణరావు, ఆర్.రఘు తదితరులు

మచిలీపట్నంలోని లేడీ యాంప్తిల్ జూనియర్ కళాశాలలో మూల్యాంకన ప్రక్రియను పరిశీలిస్తున్న డిఇఒ తాహెరా సుల్తానా

టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ), కలెక్టరేట్ (కృష్ణా)

ఎన్‌టిఆర్; కృష్ణాజిల్లాల్లో బుధవారం పదో తరగతి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 26వ తేదీ వరకూ కొనసాగుతుంది. కృష్ణాజిల్లాకు సంబంధించి మచిలీపట్నంలోని లేడీ యాంప్తిల్ జూనియర్ కళాశాలలో మూల్యాంకన ప్రక్రియ జరుగుతోంది. సుమారు వెయ్యి మంది సిబ్బంది పాల్గొంటున్నారు. 188 మంది చీఫ్ ఎగ్జామినర్ల (సిఇ)ను, 562 మంది అసిస్టెంట్ చీఫ్ ఎగ్జామినర్లు (ఎఇ)లను, 220 మంది స్పెషల్ అసిస్టెంట్ల (స్పెషల్ అసిస్టెంట్లు)ను మూల్యాంకనం కోసం నియమించినట్లు కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా తెలిపారు. సుమారు లక్ష ఎనభై వేల పైచిలుకు వరకు జవాబు పత్రాలు వచ్చాయని తెలిపారు. వీటిలో తెలుగు జవాబు పత్రాలు 22,107, తెలుగు కాంపోజిట్ పేపర్లు 5,213, హిందీ 21,304 ఇంగ్లీష్ 27,391, లెక్కలు 30,183, పిఎస్ 22,905, ఎస్ఎస్ 22,905, సోషల్ స్టడీస్ 22,877, సంస్కృతం జవాబు పత్రాలు 523 వచ్చినట్లు తెలిపారు. ఈ ప్రక్రియకు క్యాంప్ అధికారిగా డిఇఒ తాను, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారిగా డేవిడ్ రాజు, డిప్యూటీ క్యాంప్ అధికారిగా యు.వి.సుబ్బారావు వ్యవహరిస్తారని తెలిపారు. అలాగే రిజర్వ్‌లో మరో 345 మంది ఉపాధ్యాయులను సిఇలుగా, ఎఇలుగా, స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించినట్లు తెలిపారు. అలాగే ఒక్కో సిఇ కింద ముగ్గురు ఎఇలు, ఒక స్పెషల్ అసిస్టెంట్ పనిచేస్తారన్నారు. మూల్యాంకన ప్రక్రియకు హాజరైన అధికారులకు, ఉపాధ్యాయులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిఇఒ తెలిపారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి మూల్యాంకనం విజయవాడలోని బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఎన్‌టిఆర్ జిల్లాకు తొలిసారిగా మూల్యాంకణ కేంద్రం ఏర్పాటుచేశారు. అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభమైనట్లు ఎన్‌టిఆర్ జిల్లా డిఇఒ సి.వి.రేణుక తెలిపారు. మూల్యాంకణ విధుల్లో సిఇ, ఎఇ, ఎస్ఇలు కలిపి మొత్తం 1020 మంది విధులకు హాజరయ్యారని తెలిపారు. మూల్యాంకణ కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అవనిగడ్డ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ సింహాద్రి రమేష్‌బాబు, అంతర్‌చిత్రంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించిన వెంకటేశ్వరరావు

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

8 మంది వ్యవసాయ కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండలంలోని పులిగడ్డ - పెనుమూడి వారధిపై రామచంద్రాపురం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. అవనిగడ్డకు చెందిన 9 మంది వ్యవసాయ కార్మికులు గుంటూరు జిల్లా కొల్లూరు మండలం జొన్నలగడ్డలో మొక్కజొన్న కంకులు విరిసేందుకు వెళ్లి తిరిగి ఆటోలో వస్తుండగా పెనుమూడి వారధిపై ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఒక కార్మికుడు మరణించగా, 8 మంది కార్మికులు

(మిగతా 6లో)

విరివిగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో విరివిగా పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ఔత్సాహికులను ప్రోత్సహించాలని, యువతకు ఉపాధి కల్పిస్తూ పారిశ్రామిక అభివద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో జిల్లా పారిశ్రామిక అభివద్ధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన, భూసేకరణ, కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామికవాడల్లో 23 పెద్దతరహా పరిశ్రమలు, 6వేలకు పైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని, ఆయా పరిశ్రమలు నీరు, వాయు, భూ కాలుష్యం జరగకుండా ప్రమాణాలు పాటించేలా అధికారులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పర్యటించాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కెమికల్ బాయిలర్స్ పరిశ్రమలను సందర్శించి నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. కొత్తగా స్థాపించే పరిశ్రమలకు సింగిల్ విండో పద్ధతి ద్వారా వెంటనే అనుమతులు మంజూరు చేసి ఉపాధి. కల్పనకు కషి చేయాలని చెప్పారు. కంపెనీ యాజమాన్యాలు కనీస వేతనం, ప్రావిడెంట్ ఫండ్ కల్పిస్తున్నదీ లేనిదీ తనిఖీ (మిగతా 6లో)

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ రాజాబాబు

రంజాన్ వేళలు

వారం		వేళలు
గురువారం	ఇఫ్తార్	6.44
శుక్రవారం	సహరి	4.37

అభివృద్ధి జరగలేదనడం హాస్యాస్పదం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-తిరువూరు : ఒక ప్రయివేటు కార్యక్రమానికి తిరువూరు వచ్చి తనపై లేనిపోని ఆరోపణ చేసిన విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) పై తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలి గడ్డ రక్షణనిధి తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. కారోనా బారినపడి ప్రజల్లో వందలాదిమంది చనిపోతే తిరువూరు రాని ఎంపి, నాలుగేళ్లలో ఎమ్మెల్యే ఒక్క లిఫ్ట్ ఇరిగేషన్ ను కూడా నిర్మించలేదని, అభివద్ధి ఏమీలేదని చెప్పటం హాస్యాస్పదంగా రక్షణనిధి ఉందన్నారు. 2019 ఎన్నికలు అనంతరం తాను, నూజీవీడు, మైలవరం ఎమ్మెల్యేలం కలిసి చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు త్వరగా పూర్తి చేసి మూడవ జోన్ లో ఉన్న తిరువూరు, గంపలగూడెం, ఏ.కొండూరు మండలాలకు సాగు నీరు అందించాలని అధికారులతో సమావేశం నిర్వహించి చెప్పినట్లు ఆయన వెల్లడించారు. తిరువూరు లోని తన కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల టిడిపి పాలన లో కూలిన వినగడప కట్లేరు బ్రిడ్జిని మీపార్లమెంటు నియోజకవర్గంలో ఇరిగేషన్ మంత్రి ఉండికూడ ఎందుకు నిర్మించలేదని ఎంపీని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మీ పాలనలో ఏ.కొండూరులో కిడ్నీ బారిన పడి మతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోలేదు, ముందులు ఇవ్వలేదు, కృష్ణా జలాల సరఫరా చేయలేదు, డయాలసిస్ కేంద్రాన్ని నిర్మించలేదు, డయాలసిస్ రోగులకు పెన్స న్ రూ.10 వేలు ఇవ్వలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత తండాల్లో 50 వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి కష్ణా జలాల అందిస్తున్నామని, తిరువూరులో రూ. 50 కోట్లతో డయాలసిస్ కేంద్రాన్ని నిర్మించి రోగులకు చికిత్స చేస్తున్నామని, త్వర లో ఏ.కొండూరు లో కూడా డయాలసిస్ కేంద్రాన్ని నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. నిత్యం 360 రోజులు నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజాల్లో ఉండే తనను నాలుగేళ్ళ తరువాత తిరువూరు వచ్చి విమర్శించే అర్హత ఎంపికి లేదని ఎమ్మెల్యే అన్నారు. ఎం పికి తమ్ముడు చిన్ని భయం పట్టుకుందని, అందుకే నోటి ఏదోస్తే ఆది మాట్లా డుతున్నారని, ముందు ఇల్లు చక్క బట్టుకోవాలని నానికి ఎమ్మెల్యే హితువుపలికారు. ఈకార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ శీలం నాగనర్సి రెడ్డి, జడ్పిటిసి యరమల రామచంద్రా రెడ్డి, కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, పసుపులేటి శేఖర్ బాబు, కో ఆప్షన్ సభ్యులు ఏరువ ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ రక్షణనిధి

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : జగ్గయ్యపేటబీ పట్టణంలోని ఉక్కు కళా వేదిక నందు మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, ప్రభుత్వ ఆస్పటల్ అభివద్ధి కమిటీ సభ్యులు పటాన్ అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును మంగళవారం రాత్రి శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఉపవాస దీక్షలతో రంజాన్ మాసం శాంతి, ప్రేమ, దయ సౌభ్రాతత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలకు నూతన వస్త్రాలు అందించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఎన్టీఆర్ జిల్లా వక్స్ బోర్డ్ సెక్రెటరీ జుబేర్, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఈద్గా కమిటీ చైర్మన్ షేక్ మోహిద్దీన్, కోఆప్షన్ ఖాదర్ బాబు, దర్గా కమిటీ చైర్మన్ ఖాజా, ఈద్గా కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అలీమ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ : సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. భవానిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోరా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు మానవ అక్రమ రవాణా, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ నేరాలు వాటి నివారణకు తీసుకునే చర్యలపై అవగాహన కార్యక్రమం జరిగింది. పొక్సో యాక్ట్ గురించి, డైయల్ 100, 112 , దిశ యాప్ వలన కలిగే ఉపయోగాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, ఎల్.హెచ్.ఎమ్.యస్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం తదితర అంశాలు, మహిళా సంబంధిత నేరాల గురించి దిశా సబ్ ఇన్‌స్పెక్టర్ శివకుమారి వివరించారు. ఈ కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ పోలీస్ అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వరిగడ్డి దగ్ధం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని గండ్రాయి గ్రామంలో మంగళవారం వరి గడ్డి ట్రాక్టర్ కు అగ్ని ప్రమాదం జరిగింది. గండ్రై గ్రామానికి చెందిన డి వెంకట్ రమణ తన పొలంలో ఎకరం వరిగడ్డిని ట్రాక్టర్ తో ఇంటికి తరలిస్తుండగా మల్కాపురం రోడ్డులో వరిగడ్డి ట్రాక్టర్‌కు విద్యుత్ హైటెన్షన్ వైరు తగిలి మంటలు వ్యాపించాయి. సకాలంలో జగ్గయ్యపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. దీంతో వరిగడ్డి మాత్రమే కాలిపోయింది. పదివేల రూపాయలు నష్టం జరిగింది. డ్రైవర్ అప్రమత్తత, సకాలంలో జగ్గయ్యపేట ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేయటంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అంజుమన్ ఎ ఇస్లామియా ఆధ్వర్యంలో విజయవాడ పంజా సెంటర్ అంజుమన్ ఆఫీస్‌లో రంజాన్ పండుగను పురస్కరించుకొని పేదలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా డీఎస్పీ రెహమాన్, ఏపి.ముస్లిం లీగ్ జనరల్ సెక్రటరీ షేక్ ఖాజావలి, కాంగ్రెస్ పార్టీ బషీర్, ఎక్స్ అంజుమన్ ప్రెసిడెంట్ ఖాదర్ మొహిద్దిన్, ఇప్పటి అంజుమన్ ఎ ఇస్లామీయా అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్, సెక్రటరీ షేక్ బషీరుల్లా ట్రెజరర్ ఇక్బాల్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్స్ యూనియన్ నేతలపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయవాడ : ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు, కార్యకర్తలు, సిఐటియు నేతలపై మోపబడిన కేసు బుధవారం కోర్టు కొట్టివేసింది. విజయవాడ కోర్టు ప్రాంగణంలోని అడిషనల్ కోర్టు ఆఫ్ మెజిస్ట్రేట్ 12 మందిపై మోపబడిన కేసును కొట్టేసింది. ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులు కె ధనలక్ష్మీ, కె స్వరూపరాణి, కె సుబ్బరావమ్మ, ఆర్‌వి నరసింహారావు, డి రమాదేవి, ఎ కమల, జిల్లా నాయకులు ఎ వెంకటేశ్వర రావు, ఈవినారాయణ, కె దుర్గారావు, అబ్దుల్ భారీ, టి నరేష్, కె రామకృష్ణ, శ్రీలక్ష్మీపై మోపబడిన కేసు కొట్టేయబడింది. అయితే ఈ కేసులో ఉన్న విజయవాడ నగర శ్రామిక మహిళా నాయకురాలు శ్రీలక్ష్మీ మధ్యంతరం లోనే కన్నుమూసిన విషయం తెలిసిందే. కేసును కోర్టు కొట్టేయడం పట్ల ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మీ బుధవారం ఒక ప్రకటనలో హర్షం ప్రకటించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న ఆశా వర్కర్స్, సిఐటియు నాయకులు, కార్య కర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కోర్టు కేసులో ఉండి సహకరించిన వారికి ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ధనలక్ష్మీ తెలిపారు.

సహస్ర చండీయాగం ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - భవానీపురం : శ్రీదేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠం వద్ద ఈ నెల 27 నుండి మే 3 వరకూ జరుగనున్న సహస్ర చండీ యాగం ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ చైర్మన్,సహస్ర చండీ యాగం ఉత్సవ కమిటీ అధ్యక్షులు పూనూరు గౌతమ్ రెడ్డి బుధవారం పరిశీలించారు. చండీ యాగం సందర్భంగా యాగశాల వద్ద 72 అడుగులు ఎత్తుగా నిర్మిస్తున్న అస్టాదశభుజ మహా చండీ మట్టి విగ్రహాన్ని నిర్విరామంగా తయారు చేస్తున్నారు. చండీ విగ్రహాన్ని స్థాపించే ఆధారపీఠం వివరాలు ఆయన శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు స్వామీజీ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అలాగే యాగశాల నిర్మాణం పనులు ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్ రెడ్డితో కలిసి విజయవాడ నగర వైసీపీ మాజీ మహిళా కన్వీనర్ లఖంరాజు సునీత పరిశీలించారు. గిన్నిస్ ట్రిబుల్ రికార్డు సష్టికర్త గజల్ శ్రీనివాస్ మార్గ దర్శకత్వంలో నిర్వహిస్తున్న ఈ సహస్ర యాగానికి ప్రముఖులు అందరూ ముందుకు రావడం పట్ల పీఠాధిపతులు కరుమారి దాసు స్వామీజీ హర్షం వ్యక్తం చేశారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నందిగామకు చెందిన రుక్మిణి జన్మదినాన్ని పురస్కరించుకొని పదిమంది హెచ్ఐవి బాధిత పిల్లలకు పౌష్టికాహారాన్ని (పోస్టర్ కేర్), దుప్పట్లు అందజేయడం జరిగిందని ఆ సంస్థ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్లపాటి మాట్లాడుతూ దాతల సహాకారంతో పది మంది బాలలకు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రేయస్సు సిబ్బంది కోటేశ్వరరావు, విజయ కుమారి,ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కొత్తపేట, కోమల విలాస్ సెంటర్‌లోని సింహాద్రి అప్పన్నస్వామి వారి చందనోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. . ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొనకళ్ల విద్యాధరరావు, కొరగంజి భాను , పిళ్ల తిలక్ , శీనన్న దళం అధ్యక్షులు పోతిన వరప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసిపిఐ విస్తరణకు 'గౌస్' కృషి

పజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక పశ్చిమ 55వ డివిజన్ ఫోర్ మెన్ బంగ్లా ఎర్ర కట్ట వద్ద ఎంసిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎండీ గౌస్ ద్వితీయ వర్ధంతి బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్య దర్శి ఎస్.కె. ఖాదర్ బాషా మాట్లాడుతూ ఎండీ గౌస్ పార్టీని దేశ వ్యాప్తంగా విస్తరించేందుకు లాల్ -నీల్ శక్తులను ఏకం చేసి మతోన్మాదులశక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా జరిగిన అనేక పోరాటాల్లో పాల్గొన్నారని చెప్పారు. వామపక్ష పార్టీల ఐక్యత కృషి చేశారన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ విజయవాడ అర్బన్ కార్యదర్శి షేక్ అజాజ్, యువజన సమాఖ్య రాష్ట్రఅధ్యక్షులు (ఏఐడిఎఫ్)ఎస్ డి సుభాని, జిల్లా నాయకులు నెమలిపూరి చంద్ర శేఖర్, గల్లా శివా, ఎస్ డి అజీస్ ఎస్ డి వాహేద్ విజయవాడ నాయకులు ఎస్ డి తాహేర్ పాల్గొన్నారు.

కంప్యూటర్ల బహూకరణ

ప్రజాశక్తి - భవానీపురం : సామాజిక సేవలో భాగంగా విజయవాడకు చెందిన పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ వారు ఎస్ కే సి వి చిల్డ్రన్ ట్రస్టుకు భవానీపురం వారి ప్రేమ విహార్లోని విద్యార్థుల కోసం రూ.60,000లు విలువగల రెండు కంప్యూటర్‌లను బహుకరించారు .అనంతరం. ప్రేమ విహార్లోని బాలురకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి ఎ.జ్యోత్స్న పాల్గొన్నారు.

కంప్యూటర్లు బహూకరిస్తున్న దృశ్యం

'శ్రీనిధి' టెక్నో స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తిరువూరు : తిరువూరులోని శ్రీనిధి టెక్నో స్కూల్ 13వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా వార్షికోత్సవ వేడుకలను సిఐ రుద్రరాజు భీమరాజు, నాగసింధు స్పిన్నింగ్ మిల్ టెక్నీకల్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. టీనేజీ వయసులో ఉన్న పిల్లల కదలికలను పరిశీలించాలని సిఐ తల్లి తండ్రులకు విజ్ఞప్తి చేశారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇస్తున్నామని, ఆ ఫోన్‌తో ఏమి చేస్తున్నారో గమనించాలని లేదంటే వాళ్ల జీవితాలు సక్రమైన పద్ధతిలో ఉండవని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్య క్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.కిషోర్ బాబు, చైర్మన్ పి.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ ఆర్.వెంకటనారాయణ, డైరెక్టర్ సురేష్ బాబు ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ఆగస్టు నాటికి వైద్య కళాశాలలో అడ్మిషన్లు : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : 2023-24 విద్యా సంవత్సరంలో ఆగస్టు నాటికి 150 సీట్లతో మచిలీ పట్నం వైద్య కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభిస్తామని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో ఆయన అధికారులతో సమావేశమై మచిలీపట్టణానికి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వైద్య కళాశాల భవన నిర్మాణాల పురోగతిపై చర్చించారు. తరగతి గదులు, గ్యాలరీ, ప్రయోగశాల, అడ్మినిస్ట్రేషన్, డిపార్ట్ మెంటల్, అకడమిక్ అండ్ ఎగ్జామినేషన్ బ్లాక్లు, బాలబాలికల వసతి గృహాల నిర్మాణాల పురోగతిని మ్యాప్ ల ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.550 కోట్లతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మచిలీపట్నం వైద్య కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేసి ఆగస్టు నాటికి మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభిస్తామని తెలిపారు. అప్రోచ్ రోడ్లు, ఆర్చ్ నిర్మాణం, అంతర్గత విద్యుత్ పనులు, కాంపౌండ్ వాల్, నీటి సరఫరా వంటి పనులు పూర్తి చేయాల్సి ఉందని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రెడ్జింగ్ ద్వారా వచ్చే ఇసుక లెవెలింగ్ చేయడానికి ఉపయోగపడేదీ, లేనిదీ మట్టి నమూనాలను పరీక్షకు పంపాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు రెండవ సంత్సరంలో చేరే నాటికి జూన్, 2024 నాటికి అన్ని భవన నిర్మాణాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ నెల 17న నేషనల్ మెడికల్ కమిషన్ ప్రతినిధులు సందర్శించి నిర్మాణ పనుల పట్ల సంతప్తి వ్యక్తపరచినట్లు ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్ కు తెలిపారు. ఈ సమావేశంలో జీజీ హెచ్ సూపరింటెండెంట్ ఘంటా వరప్రసాద్, ప్రిన్సిపల్ డా.విజయకుమారి, వైస్ ప్రిన్సిపల్ ఆశాలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మెండు లింగం నాయుడు, ఎస్ఈ అంకమ్మ చౌదరి, డా.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి టెన్నిస్, క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదేవి : మండల కేంద్రమైన మోపిదేవిలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లా స్థాయిలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వాహకులు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎంకెపి ఆటో ఫైనాన్స్ నిర్వాహకులు మలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీ సాయి మేఘన చికెన్ సెంటర్ యజమాని, ఎంపీటీసీ సభ్యులు కారుమూరి శివ నాగరాజు ల ఆధ్వర్యంలో ఏప్రిల్ 25వ తేదీ నుంచి నాకౌట్ పద్ధతిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 24వ తేదీ వరకు జట్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మొదటి బహుమతిగా రూ. 50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 25 వేలతో పాటు ప్రతి మ్యాచ్ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. బాల్ కమిటీ వద్దనే తీసుకోవాలని, ఎవరి కిట్ వారే తెచ్చుకోవాలని, ఒక టీంలో ఆడిన క్రీడాకారుడు వేరొక టీం లో ఆడకూ డదన్నారు. 15 మంది క్రీడాకారులతో కూడిన లిస్టును కమిటీ వారికి ముందుగానే అందజే యాలన్నారు. అంపైర్లదే తుది నిర్ణయమనీ, డబుల్ బ్లేడ్ బ్యాట్లకు అనుమతి లేదన్నారు. పోటీలలో పాల్గొని వారు సెల్ - 8121818211, 9866972793, 9490 942557 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు. యడ్ల ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించే ఈ కార్యక్రమానికి క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కారుమూరి శివ నాగరాజు కోరారు. తొలుత మలిశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి శివనాగరాజులు పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

వానపాము ఎరువుతో పంచాయతీలకు ఆదాయం : డిపిఒ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం అల్లాపురంలో స్వపక్ షెడ్ వద్ద తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి తడిచెత్త నుండి వానపాము ఎరువు తయారు చేయు విధానాన్ని బుధవారం డిపిఓ నాగేశ్వర్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడిచేత్తను వివిధ రకాలుగా విడకొట్టి వాటినుండి ఎరువు తయారు చేసి విక్రయించడం ద్వారా ఆదాయం ఏ విధంగా పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఆదాయం పొందడానికి వర్మీ కంపోస్ట్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. గ్రామాల్లో చెత్త సమస్య పరిష్కారానికి దోహద పడు తుందని చెప్పారు. పంచాయతీ అధికారులకు దీనిని రోల్ మోడల్ గా చూపించాలని తెలిపారు. గుడివాడ డివిజినల్ పంచాయతీ అధికారి సంపత్ కుమారి, ఎంపీపీ అనగాని రవి, సర్పంచ్ డొక్కు వెంకన్నబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం హిందూ స్మశాన వాటిక ను పరిశీలించి అక్కడ. జరుగుతున్న అభివద్ధిని చూసి సంతప్తిని వ్యక్తం చేశారు. ఎంపిటిసి సభ్యురాలు గంతోటి ప్రశాంతి , ఉపసర్పంచ్ అవుటపల్లి శివప్రసాద్ , హిందూ స్మశాన వాటిక అభివద్ధి కమిటీ సభ్యులు గుర్రం. నరసయ్య, గొంది పరందామయ్య, కారంపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ టాలెంట్ సెర్చ్ ఫలితాల్లో ప్రతిభ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్-2022 ఫలితాల్లో ఉయ్యూరు శ్రీ చైతన్య స్కూల్ 260 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచి బహుమతులు గెలుచుకున్నారు. సాయిచరణ్ ప్రథమ బహుమతిగా లినోవో ట్యాబ్, వర్షికా రెడ్డికి ద్వితీయ బహుమతిగా బోల్డ్ స్మార్ట్ వాచ్, శ్రీకరిదేవికి తతీయ బహుమతిగా ఫింగర్ ఎంఒటి, ప్రణీత్ జ్యు నాల్గవ బహుమతిగా స్కైబ్యాగ్, కుర్షియాకు ఐదవ బహుమతిగా హెడ్ సెట్ గెలుపొందారు. మరో 26 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 32 మందికి కన్సోలేషన్ బహుమతులు, 6 మందికి ప్రత్యేక బహుమతులు, 132 మంది మెరిట్ సర్టి ఏకెట్లు సాధించినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ పుల్లయ్య తెలిపారు. మంగళవారం స్కూల్లో ఏర్పాటుచేసిన ఈకార్యక్రమంలో స్కూల్ ఆర్ఎస్ఐ దీరేంద్ర విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సి- బ్యాచ్ టెక్నో ప్రోగ్రామ్స్ వల్ల ఇటువంటి ఫలితాలు సాధ్యమయ్యాయని ప్రిన్సిపాల్ తెలిపారు. స్కూల్ ఈజీఎం మురళీకష్ణ, కో-ఆర్డినేటర్ అశోక్, డీన్ నాగేంద్ర విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజేతలను అభినందించారు.

కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి-కోడూరు : అవనిగడ్డ నియోజక వర్గం నలుమూలల నుంచి కోడూరు మండలంలో ఈనెల 2వ తేదీన లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగిన కంటి వైద్య శిబిరంలో ఎంపికైన వారికి మొదటి విడతగా 18 మందికి తమ సొంత ఖర్చులతో తీసుకెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు, ఆపరేషన్లు, కళ్ళజోళ్ళు అందించినట్లు లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ అధ్యక్షులు పూతబోయిన అయ్యప్ప స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బడే నాని, బండే జయ కిషోర్, దామెర్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- గన్నవరం ప్రభుత్వాస్పత్రి ఇన్చార్జి డాక్టర్ సారమ్మ

ప్రజాశక్తి-గన్నవరం : ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి ఇంచార్జ్ డాక్టర్ సారమ్మ తెలియజేశారు. స్థానిక వాతావరణ సమాచారం తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, నెత్తికి టోపి పెట్టుకోవాలని లేదా రూమాలు కట్టుకోవాలని తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. అదేవిధంగా మీ కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించాలని, దాహం వేయకపోయిన తరుచుగా నీటిని తాగాలన్నారు. ఉప్పుకలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓ ఆర్ యస్ కలిపిన నీటిని తాగాలన్నారు.. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో, దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు గాని , నిమ్మరసం గాని, కొబ్బరినీరు గాని తాగా లని, తీవ్రమైన ఎండలో బయటికి వెళ్ళినప్పుడు తల తిరుగుట, వాంతులు ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే దగ్గరలోని వైద్యుణ్ణి సంప్రదించాలన్నారు. ఇంటి వాతావరణం చల్లగా ఉంచుకోవాలని, తక్కువ ఖర్చుతో కూడిన చల్లదనం కోసం ఇంటిపై కప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటి లేషన్, థర్మోకోల్ ఇన్సు లేషన్ ను ఉపయో గించాలన్నారు. మేడపైన మొక్కలు, ఇంట్లో ని మొక్కలు (ఇండోర్ ప్లాంట్స్) భవనాన్ని చల్లగా ఉంచుతాయని, అదేవిదంగా ఉష్ణతాపాన్ని తగ్గిస్తాయన్నారు.

ఎండ తీవ్రతంగా ఉన్నప్పుడు చేయకూడనివి

ఎండలో గొడుగు లేకుండా తిరగరాదని, వేసవి కాలంలో నలుపురంగు,మందంగా ఉండే దుస్తులు ధరించరాదన్నారు. మధ్యాహ్నం తరువాత (మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 3గంటల మధ్యకాలంలో) బయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనిచేయరాదని,. బాలింతలు, చిన్నపిల్లలు, వద్దులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగరాదని, వీరిపై ఎండ ప్రభావం త్వరగా చూపే అవకాశం ఉందన్నారు. శరీరాన్ని డీహైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ మరియు కార్బోనేటేడ్ శీతల పానీయాలు మానేయాలన్నారు. . అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలను తీసుకోవద్దన్నారు. ఎండలో నుంచి వచ్చిన వెంటనే తేనె వంటి తీపిపదార్థములు తీసుకొనకూడదన్నారు. ఎండ ఎక్కువగా వున్న సమయంలో వంట చేయకుండా ఉండాలని, వంట గది తలుపులు, కిటికీలను తీసివుంచి తగినంత గాలి వచ్చేవిదంగా చూసుకోవాలన్నారు.

23న గురుకులాల్లో ప్రవేశానికి పరీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నందు ప్రవేశాలకు అర్హత పరీక్ష షెడ్యూల్ విడుదల చేసినట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి కె. పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు.సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో ఐదో తరగతికి 743 మంది, జూనియర్ ఇంటర్మీడియట్ కు 923 మంది జిల్లాలోని ఆరు సెంటర్లలో ఈనెల 23వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరు కాబోతున్నారన్నారు. 5 వ తరగతి ప్రవేశ పరీక్ష ఉ.10 గంటల నుండి మ.12 గంటల వరకు, జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్ష మద్యాహ్నం 2గంటల నుండి సా.4.30 గంటల వరకు పరీక్షను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షకు అరగంట ముందుగానే సంబంధిత పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకోవాలని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కే పద్మజ ఆ ప్రకటనలో తెలిపారు.

పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండల పరిధిలోని కొక్కిలిగడ్డ గ్రామ పంచాయతీ పంచాయతీలో సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఎన్ హరిబాబు నాయక్ ఆధ్వర్యంలో సర్పంచ్ రాంబాబు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి పూజలు నిర్వహించి, పనులను ప్రారంభించారు. 2022 - 2023 వ ఆర్థిక సంఘంలో 11 వేల 102 పని దినాలు కొక్కిలిగడ్డ గ్రామ పంచాయతీలో కల్పించినట్లు హరిబాబు నాయక్ తెలిపారు. 2023 -2024 వ ఆర్థిక సంవత్సరంలో 15 వేల పని దినాలతో రూ. 40 లక్షల 80 వేలతో అంచనాలు తయారు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముమ్మనేని బాబురావు, పంచాయితీ కార్యదర్శి కొల్లిపర రామ కోటేశ్వరరావు, ఏపీఓ ఎస్ మజ్ను, ఫీల్డ్ అసిస్టెంట్ తూము ధనలక్ష్మి, మేట్ లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులపై సమీక్ష

ప్రజాశక్తి-పమిడిముక్కల : నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని సుభాని అన్నారు. బుధవారం పమిడిముక్కల మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో జరిగినక నాడు-నేడు పనులపై జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మేడూరు, కపిలేశ్వరం ఉన్నత పాఠశాల పనులను ప్రారంభించాలని ఆయన అన్నారు. ఇసుక కొరతలేకుండా స్టాక్ చేసుకోఆవలన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వక్కలగడ్డ కేశవనారాయణ, ఐనపూరు ప్రధానోపాధ్యాయులు స్వామి, వీరంకులకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధావాణి, మంటాడ, కపిలేశ్వరపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం బుద్ధవరం గ్రామంలో ముక్కామల వెంకట్రావు విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఫణి అభినయ్ ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సిఐ కనకారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలను దష్టిలో పెట్టుకొని గ్రామాల్లో చలివేంద్రములు ఏర్పాటు చేసి మంచినీటిని పాదచారులకు అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.దాహార్తిని తీర్చడం మంచి సంప్రదాయమన్నారు. బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న సిఐ

వైసిపి పాలనలో రాష్ట్రం దివాళా : సౌమ్య

ప్రజాశక్తి-కంచికచర్ల: ముఖ్యమంత్రి జగన్ అవినీతి పాలనలో రాష్ట్రం దివాళా తీసిందని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆరోపించారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె స్థానిక గొట్టుముక్కల రోడ్డు, వసంత కాలని లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయిందని ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి మీడియా ముందుకు వచ్చి చెప్పటం దేశం లో ఎక్కడా ఇంతవరకు ఎదురు కాలేదన్నారు. దీన్ని బట్టి చూస్తే ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ఖజానాను బొక్కేసినట్లు ప్రజలకు అర్థం అవుతుందన్నారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పల రాష్ట్రంగా మార్చిన ఘనత జగన్ కే దక్కిందన్నారు. ప్రకతి వనరులను దోచేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో అవినీతి, అరాచక పాలనను సాగనంపాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, మాజీ ఎంపిపి అల్లడి కోటేశ్వరరావు, నాయకులు గుత్తరత్నం, గుర్రం రామకష్ణ, తాడపనేని లక్ష్మణరావు, గుత్తా ఓంకార్, గూడవల్లి గణేష్, వేమ వెంకటరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బాణావత్ త్రివేణి, బర్రె వాసు తదితరులు పాల్గొన్నారు.

4,425 మందికి ఉపాధి

ప్రజాశక్తి-మైలవరం: మండలంలోని 10 గ్రామపంచాయతీలలో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. బుధవారం 4425 మంది ఉపాధి కూలీలు పాల్గొన్నట్లు ఏపీవో వీర్ల వెంకయ్య తెలిపారు. పంట కాలువలు, డొంక రోడ్లు, చిన్నచిన్న కుంటలు, చెరువుల పనులు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

బడుగుల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న : ఉమా

ప్రజాశక్తి-విజయవాడ రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడిగా, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా గౌతు లచ్చన్న సాగించిన ప్రయాణం ఆయన్ను మహనీయునిగా నిలబెట్టిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడి టీడీపీ కార్యాలయంలో బుధవారం లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఉత్తరాంధ్ర నుంచి ఎగసిపడ్డ రాజకీయ కెరటం, జీవితాంతం బలహీనవర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన పేదల ఆశాజ్యోతి అన్నారు. దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు సాదనల ప్రసాదరావు, నర్రా వాసు, కొమ్మినేని రామారావు, గూడపాటి పద్మశేఖర్, రంగినేని నరేంద్రబాబు, ఇరుగులపాటి దిలీప్ కుమార్, ధారావత్ శ్రీను నాయక్, సురేష్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో 200 మంది కూలీలు

ప్రజాశక్తి-గంపలగూడెం: ప్రస్తుతం మండల కేంద్రమైన గంపలగూడెంలో రైతులకు అవసరమైన పంట కాలువల పునరుద్ధరణ పనులను చేపడుతున్నట్లు గంపలగూడెం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నల్లగట్ల మధు తెలిపారు. బుధవారం నాడు స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉపాధి హామీ పనుల్లో భాగంగా 200 మంది కూలీలు కాలువ పనులు చేపట్టారు. ఈ సందర్భంలో కూలీలకు ప్రతిరోజు 200 రూపాయలకు తగ్గకుండా కూలీ వస్తున్నట్లు తెలుపుతున్నారు. గ్రామంలో ఉన్న కూలీలందరికీ తగిన స్థాయిలో పనులు కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం చేపడుతున్న పంట కాలవల పునరుద్ధరణతో రైతులకు మేలు కలుగుతుందన్నారు.

చుట్టుగుంట వద్ద ప్రచారభేరీలో పాల్గొన్న సిపిఎం, సిపిఐ నేతలు

తిరువూరు పట్టణంలో...

కార్పొరేట్ అనుకూల బిజెపిని గద్దె దించుతాం

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం, సిపిఐ ప్రచార భేరీల్లో నేతలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్

ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోన్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరుతూ సిపిఎం, సిపిఐ చేపట్టిన ప్రచారభేరీ పాదయాత్ర బుధవారం ఐదో రోజు చుట్టుగుంట విశాలాంధ్ర సెంటర్ వద్ద ప్రారంభమైంది. నిమ్మతోట, జమ్మిచెట్టు సెంటర్ మీదుగా భగత్‌సింగ్ గ్రంథాలయం, బందిలదొడ్డి తదితర ఏరియాల్లో ప్రచారభేరి సాగింది. కేంద్రంలోని మతోన్మాద బిజెపి, కార్పొరేట్ల అనుకూల ప్రభుత్వ విధానాలు నశించాలని, వామపక్షాల ఐక్యత వర్థిల్లాలని, మోడీని గద్దెదించాలంటూ నినాదాలు మారుమ్రోగాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల అనుకూల విధానాలను అనుసరిస్తూ దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేళ్ల కాలంలో ఒక్కో కుటుంబం దగ్గర నుంచి లక్ష రూపాయల చొప్పున పన్నుల రూపంలో వసూలు చేశారన్నారు.. మోడీ ప్రభుత్వం పేదలను కొల్లగొట్టి కార్పొరేట్లకు దోచిపెట్టే దళారీగా వ్యవహరిస్తుందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేళ్ల పాలనా కాలంలో అన్ని రకాల ధరలు నింగినంటాయన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవించడం కష్టంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం పెరిగిపోయిందని, రైతులకు మద్దతు ధర లేకుండా పోయిందని అన్నారు. ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీ నెరవేరలేదని దుయ్యబట్టారు. దేశాన్ని సర్వనాశనం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఎం, సిపిఐ నాయకులు జి.రామన్న, పుప్పాల కృష్ణ, మురహరి, జి క్రాంతి, లంకా దుర్గారావు, డి.శ్రీనివాసరావు, నక్కా వీరభద్రరావు, గురుమూర్తి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంచికచర్ల:** కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, ఇటువంటి ప్రజా వ్యతిరేక బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కళ్యాణ్ పిలుపునిచ్చారు. బుధవారం కంచికచర్ల సిపిఎం కార్యాలయం వద్ద ప్రచారభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదని కార్పోరేట్ల పరం చేస్తూ పేద ప్రజలపై పన్నులు భారం మోపుతున్నారన్నారు. పెట్రోలు డీజిల్ ధరలు అమాంతం పెంచేసారన్నారు. నిత్యావసర సరుకులు పేద ప్రజలకు అందుబాటులో లేవన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని కార్పొరేట్లకు కట్టబెడుతూ దేశ సంపదను దోచిపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భుక్యా గోపినాయక్, జవేద, బెజ్జం భూషణం, పాలపర్తి వెంకట్రావు, బాష, మాధవ్, రాము తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ రూరల్:** విజయవాడ రూరల్ మండలం పి. నైనవరం గ్రామంలోని సుందరయ్యనగర్ కాలనీలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ సిపిఎం మండల కార్యదర్శి మాతంగి ఆంజనేయులు, చప్పిడి రాంబాబు, సట్టు శ్రీనివాసరావు, మాతంగి నాగమల్లేశ్వరరావు, ముగుడా సురేష్, పొలాసు నారాయణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాత బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కూడలి, ముక్యాల రోడ్డు, పెద్దమ్మ గుడి, కమల సెంటర్, కోదాడ రోడ్, క్రిస్టియన్ పేట, మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో జాతీయ ఉపాధి హామీ కూలీలకు, రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, దాసరి నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు ఎ శివాజీ, పోతుపాక వెంకటేశ్వర్లు, నాగులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తిరువూరు:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో తిరువూరు పట్టణంలో ప్రచారభేరి యాత్రను నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్ నుండి మధిర రోడ్డు సెంటర్ మీదుగా బోసుబొమ్మ బస్టాప్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, జిల్లా నాయకులు డి.శంఖర్ మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే పన్ను విధానం పేరుతో అన్ని వస్తువులు ధరల పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాలు వేసిందన్నారు. విద్యుత్ సవరణ చట్టం తీసుకువచ్చి విద్యుత్ ప్రైవేటీకరణ చేసి విద్యుత్ ఛార్జీలు మరింత పెంచే కుట్రను కేంద్రం చేస్తుందని చెప్పారు. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లను బిగించి ఉచిత విద్యుత్ పథకానికి క్రమంగా మంగళం పాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. మరోవైపు దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్నా రు. పంటలకు గిట్టుబాటు ధరలు అందేలా గిట్టుబాటు ధరల చట్టం తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్వీ భద్రం, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.ప్రభాకరరావు, పి.శ్రీనివాసరావు, ఆకుల రవి, సిహెచ్.సురేష్, కె.వి.రత్నం, ఎం.చింతయ్య, ఎస్.కె.మస్తాన్, శివరామకృష్ణ, సిపిఐ నాయకులు కొత్తపల్లి సుందరరావు, తూము కృష్ణయ్య, ఉదయ్, ముత్తయ్య, మురళీ, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

షేర్‌మహ్మద్‌పేటలో...

పి.నైనవరంలో...

కంచికచర్లలో...

ఫిష్ ఆంధ్ర మినీ అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని పెంచుతూ ప్రజలకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్న 'ఫిష్ ఆంధ్ర' అలాగే పరిశుభ్రత, నాణ్యమైన చేపలను తక్కువ ధరకే అందించాలని మినీ అవుట్లెట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కోదాడ రోడ్డు మరియు తోర్రగుంటపాలెం నందు ప్రభుత్వ సబ్సీడీతో నడుకుదురు శివ కుమారి, కరీసే మధు, నడుకుదురు నాగరాజు ల నూతన ఫిష్ ఆంధ్ర మినీ ఫిష్ వెడింగ్ యూనిట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను ప్రారంభించారు. ఈ సంద్భంగా ఉదయభాను మాట్లాడుతూ భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే మత్స్య ఉత్పత్తిలో ఆంధ్ర రాష్ట్రం గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 40 శాతం మత్స్య ఉత్పత్తులు మన రాష్ట్రం నుంచే జరగడం గర్వించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా మన రాష్ట్రంలో ఉత్పత్తిదారుడు, వత్తిదారులు, వినియోగదారుడు ముగ్గురికి లాభం చేకూరే విధంగా ఈ ఫిష్ ఆంధ్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 60 శాతం రాయితీతోపాటు బిసి అన్ని వర్గాల మహిళలకు 40 శాతం రాయితీ అందజేయడం జరుగుతుందని అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 11 మందికి లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి బ్యాంకు లోన్ ద్వారా ఋణసౌకర్యం కల్పించడం జరుగుతుందని అన్నారు. ఇంకనూ ఆసక్తి కలవారు ఉంటే శ్రీనిధి ద్వారా కానీ సంబంధిత అధికారుల ద్వారా ఈ అవకాశాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రామయ్య, తన్నీరు నాగేంద్ర,కాశీ కిషోర్, సొసైటీ అధ్యక్షులు బాలసైదా, అన్నేపాక రమేష్, డ్రిల్లింగ్ వర్కర్ ఖాజా, జిల్లా మత్స్య శాఖ అధికారి అయ్యా నాగరాజు, సహాయ సంచాలకులు చక్రాని, జగ్గయ్యపేట మత్స్యశాఖ సహాయ ఇన్స్పెక్టర్ శ్యామ్ లెనిన్ పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతిని జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. **కలెక్టరేట్ (కృష్ణా) :** బడుగు, బలహీన వర్గాలకు బాసటగా నిలిచిన మహనీయులు సర్దార్ గౌతు లచ్చన్న అని మచిలీపట్నం మాజీ పార్లమెంటు సభ్యులు, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. సర్దార్ గౌతులచ్చన్న 17వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక బస్టాండ్ సెంటర్లోని ఆయన విగ్రహానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ, రాష్ట్ర బీసీ నాయకులు,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు(బుల్లయ్య), డాక్టర్ ధన్వంతరి ఆచార్య, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టిడిపి పట్టణ, రూరల్ అధ్యక్షులు ఎండి ఇలియాస్ భాష, కుంచె నాని, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం పార్లమెంటు రైతు విభాగ అధ్యక్షులు గోపు సత్యనారాయణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. **గుడివాడ :** గౌతు లచ్చన్న చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి బీసీల అభ్యున్నతికీ పాటుపడాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక పాత సంత బజార్లోని గౌత్ లచ్చన సెంటర్లో టిడిపి ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలల వేసి నివాళు లర్పించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు పోలాసి ఉమామహేశ్వరరావు, పంద్రాజు సాంబయ్య,యార్లగడ్డ సుధారాణి, రెడ్డి షణ్మకం, గోవాడ శివా, వసంతవాడ దుర్గారావు, కరీముల్లా, రామదేణు వేణుబాబు, షేక్ జానీ షరీఫ్, షయ్యద్ జెబీన్, బంటు రోజా, మదాల సునీత, జె.పద్మ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, యార్లగడ్డ గోవర్ధన్, అల్లం రామోహనరావు, చింతల భాస్కర్, వెంపటి సైమన్, ఆర్టిసి యునియాన్ నాయకుడు దారం ఏడుకొండలు, మాదాసు వెంకటలక్ష్మి, వీరిశెట్టి నరసింహారావు పాల్గొన్నారు. టిడిపి నాయకులు, వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనాలు అందజేశారు. టిడిపి నాయకలు చల్లగుళ్ళ సుబ్రహ్మణం, బోబాయి శ్రీను, గుత్తా చంటి, స్పరంచ్‌లు కైలే సుబ్బారావు, రాధకృష్ణ, నిమ్మగడ్డ సాయి, గడ్డం ప్ర కా న ం దా న ం , అ డ ం న ం వి ం ల్లి లక్ష్మణరావు, గుడివాడ జోన్స్, తులసీరామ్ పాల్గొన్నారు. **ఉయ్యూరు :** సర్దార్ గౌతులచ్చన్న సేవాసమితి అధ్యక్షుడు కాగిత కొండ ఆధ్వర్యంలో బుధవారం కాటూరు రోడ్డులోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్దార్ గౌతు లచ్చన్న ఆదర్శ రాజకీయవేత్తగా అభివర్ణించారు. తన గురువు ఆచార్య ఎన్జీ రంగా కోసం తన పార్లమెంట్ స్థానానికి రాజీనామా చేసి ఆయనను ఎన్నికల్లో గెలిపించి పార్లమెంట్‌కు పంపారని గుర్తుచేశారు. ఉయ్యూరు మాజీ చైర్మన్ జె.పూర్ణచంద్రరావు, మండల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పీవి రమణ, పరిమి భాస్కర్, రెడ్డి రమణ, శ్రీను, శివాజి నివాళులర్పించారు. పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన సెంటర్‌లో చిత్రపటానికి టిడిపి అధ్యక్షుడు జె.గుర్నాధరావు, చిరంజీవి, అంజిబాబు, ఖుద్దూస్, పూర్ణచంద్రరావు, రఫీ, అప్పలనాయుడు, ఆరేపల్లి సుబ్బారావు, పామర్తి శివ, నరేశ్, నజీర్, భాస్కర్, శ్రీనివాసప్రసాద్ నివాళు లర్పించారు. **పెడన :** జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షులు బొర్రా కాశి ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పామర్తి వెంకటేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాగిత సాంబశివరావు మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షులు పోలగాని లక్ష్మీనారాయణ నేతృత్వంలో పేదలకు పండ్లు పంచిపెట్టారు. నందిగామ గ్రామంలో పోలగాని లక్ష్మి నారాయణ నేతృత్వంలో లచ్చన్న విగ్రహాన్ని వచ్చే జయంతికి ఆవిష్కరించే విధంగా కషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లా ప్రచార కార్యదర్శి మురాల ఫణి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బెల్లంకొండ లక్ష్మణ్, పెడన నియోజవర్గ ప్రధానకార్యదర్శి గూడవల్లి కృష్ణ పాల్గొన్నారు. **అవనిగడ్డ :** టిడిపి ఆధ్వర్యంలో గాంధీ క్షేత్రంలో నిర్వహించారు. గౌత లచ్చన్న చిత్రపటానికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కార్యదర్శి కర్ర సుధాకర్, ఘంటసాల రాజమోహనరావు, లుక్కా శ్రీనివాసరావు, చెన్ను గాంధీ, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, చందు బాబూరావు, మెగావత్ గోపి, షేక్ బాబావలి, బర్మా శ్రీనివాసరావు, మేడికొండ విజయ్, యలవర్తి ఆది, కొల్లూరి వాసు, యలవర్తి చిన్న, మొగల్ మురాద్, బచ్చు మురళి, గ్యాలం శ్రీను, రేపల్లె అంకినీడు, పర్మిశెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో

మచిలీపట్నంలో

అవనిగడ్డలో

ధాన్యం కొనుగోలు చేయండి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామానికి చెందిన రైతుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయకపోవటంతో కల్లాల్లో ఎక్కడి ధాన్యం అక్కడే ఉండిపోవడంతో ఎలుకలు కొరికి తీరని నష్టం చేస్తున్నాయి. గతంలో అధికారులకు మొరపెట్టుకున్నా సమస్యకు పరిష్కారం లభించక ఘంటసాల తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు బుధవారం ధర్నాకు దిగారు. ఒక్క చిట్టూర్పు గ్రామంలో 249 ఎకరాల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు కొను గోలు చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. ఒకటి, రెండు రోజుల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్న మాటలను నమ్ముతూ ప్రతిసారి మోసం పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌బికెల ద్వారా గతంలో కొనుగోలు చేసిన 5750 క్వింటాళ్ల ధాన్యానికి నేటికీ నగదు చెల్లించలేదని పలువురు రైతులు వాపోయారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేపట్టాలని, మిల్లర్ల వద్దకు వెళ్తే దాన్యం తీసుకునే పరిస్థితి లేదని ఆంక్షలతో తమను ఇబ్బందులు పెట్టడం సరికాదని తహశీల్దార్‌కు వివరించారు. అనంతరం తహశీల్దార్ బి.రామానాయక్, వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీకృష్ణకు అందజేశారు.

టిడిపి మహిళా నేత కళ్యాణికి బెయిల్

ప్రజాశక్తి-గన్నవరం

టిడిపి రాష్ట్ర మహిళా నేత కళ్యాణికి బుధవారం విజయవాడ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గన్నవరంలో జరిగిన వైసీపీ, టీడీపీ కొట్లాటలో ఆమెను ముద్దాయిగా చేస్తూ పోలీసుల కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేసులో ఆమె ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నం చేసిన ఉపయోగం లేకపోయింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాం డ్‌కు ఆదేశిం చారు. ఈ నేపథ్యంలో ఆమె తరపు న్యాయవాది కోర్టులో బెయిల్ పిటిషన్ వేసి తమ వాదన వినిపిం చగా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. విజయవాడ జైలు నుండి హనుమాన్ జంక్షన్ వచ్చిన ఆమెకు గ్రామంలోని టిడిపి నాయకులు, మహిళలు పుష్పాలతో స్వాగతం పలికారు.

ఘనంగా విశ్వభారతి వార్షికోత్సవం

గుడివాడ : స్థానిక రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం రాత్రి పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మన సంస్కృతి, ప్రకృతి, పల్లెటూరి జీవనం, దేశభక్తి తదితర అంశాలపై చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమలు విశేషంగా అలరించాయి. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచిన దామిని, వర్షిణిల శాస్త్రీయ నృత్య పదర్శన, అంతర్జాతీయ స్థాయిలో కరాటేలో ఎంపికైన జోషిక, శ్యామల ప్రదర్శనలు అబ్బురపర్చాయి. విశ్వభారతి చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్ మంజులు పలువురు చిన్నారులకు సత్కరించి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాధ, వైస్ ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థినులు

వైఎస్ విజయమ్మ పుట్టినరోజు వేడుకలు

అవనిగడ్డ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాతృమూర్తి వైఎస్ విజయమ్మ పుట్టినరోజు వేడుకలు అవనిగడ్డ వైసిపి కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.

కేకు కట్ చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదేశానుసారం పార్టీ కార్యాలయం వద్ద నాయకులు కేక్ కట్‌చేశారు. విజయమ్మకు పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌ఛార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలకుర్తి పృధ్వీరాజ్, మాజీ ఉప సర్పంచ్ గాజుల జై గోపాల్, మండల ట్రేడ్ యూనియన్ నాయకులు గార్లపాటి గోపి, శివాలయం టెంపుల్ చైర్మన్ సింహాద్రి రామనాథం బాబు తదితరులు పాల్గొన్నారు.

వరి కోత యంత్రాల దరఖాస్తులకు ఆహ్వానం : ఎఒ

ప్రజాశక్తి-ఘంటసాల

వ్యవసాయ శాఖ ద్వారా ఆర్.కె.వి.వై.సి.హెచ్.సి పథకం కింద రైతులకు 50:40:10 నిష్పతిలో రూ.25 లక్షల ఖరీదు గల కంబైన్డ్ హార్వేస్టర్స్ (భారీ వరి కోత యంత్రాల) కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ కోరారు. 50 శాతం (రూ.12.50 లక్షలు) బ్యాంకు ద్వారా రుణం, 40 శాతం రాయితీ (రూ8.80 లక్షలు), 10 శాతం రైతు వాటా (రూ.3.70 లక్షలు) ద్వారా మండలంలోని రైతులకు యంత్రాలను అందజేస్తామని వివరించారు. బీసీ, ఓసీ రైతులకు రెండు ఎకరాల పొలం ఉండాలని, ఎస్సీ,ఎస్టీ రైతులకు కనీసం ఒక ఎకరం పొలం ఉండాలని కోరారు.

కృష్ణా కలెక్టర్‌ను కలిసిన విఆర్ఒ సంఘం నేత

ప్రజాశక్తి-పెదపారుపూడి

జిల్లా కలెక్టర్ రాజబాబును పెదపారుపూడి మండలం మోపరు గ్రామ విఆర్ఒ, గుడివాడ రెవెన్యూ డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు, ఎపి ఆర్ఎస్ఎ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాట్ల అజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. తాను మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిశానని చాట్ల అజయ్‌కుమార్ తెలిపారు.

సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక చర్యలు

పమిడిముక్కల తహశీల్దార్ బి.రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రణాళిక బద్ధంగా నిర్ణీత లక్ష్యాలను సాధించాలని పమిడిముక్కల తహశీల్దార్ బి.రాజ్యలక్ష్మి చెప్పారు. పమిడిముక్కలలోని రెవెన్యూ కార్యాలయంలో ఆమె ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు పమిడిముక్కల మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు చర్యలు తీ న ు కు ం టు న్నా మ ు న్నా ర ు. రాష్ట్రప్రభుత్వం నవరత్నాలు -పేదలందరికీ ఇళ్లు కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వైఎస్సార్ జగనన్న గృహాల నిర్మాణాలు మండలంలో పురోగతి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తక్కువ పురోగతి ఉన్న గ్రామాల్లో సంబంధించిన అధికారులు క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పర్యటించి అక్కడి స్థితిగతులను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామన్నారు. జగనన్న లేఔట్లలో నీరు, విద్యుత్తు, రహదారులు సిమెంటు, ఇసుక, ఇనుము తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గృహ లబ్ధిదారులైన మహిళలకు బ్యాంకు రుణాలను సకాలంలో అందజేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. ఇంకా ధాన్యం నిల్వలు ఉన్న రైతులు అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. వరి కుప్పలకు జియో ట్యాగింగ్ ఇవ్వటం ద్వారా ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. లంకపలి, మంటాడ, తాడంకిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

నేడు రెన్యువబుల్ ఎనర్జీ రిసోర్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - భవానీపురం : ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో నగరంలోని భవానీపురంలో ఏర్పాటు చేసిన రెన్యువబుల్ ఎనర్జీ రిసోర్స్ సెంటర్ - ఇవి పబ్లిక్ ఛార్జింగ్ సెంటర్‌ను రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ, గనులు, భూగర్భ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి గురువారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్నారు. భవానీపురంలోని ఎపి కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆవరణలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం ఎలెక్ట్రిక్ వాహనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన 'గో ఎలక్ట్రిక్ క్యాంపైన్'ను కూడా మంత్రి ప్రారంభిస్తారు.

మొదటి పేజీ తరువాయి

ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు

'ఉపాధి'కి కేంద్రం తూట్లు

మండలం వెంట్రప్రగడ చేరుకున్న యాత్రలో వ్యవసాయ కార్మిక సంఘం వి.వెంకటేశ్వర్లు, వై.వెంకటేశ్వరరావు (వైవి)తోపాటు సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు శీలం ప్రకాశరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోసూరు శివ నాగేంద్ర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి వీరమాచినేని జ్యోతి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు కంభం కొండలబాబు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మాది గోపాల్, బి.రాజేష్, ఎం.సుబ్బారావు, ఎం.నాగేశ్వరరావు, ఎడుకొండలు, వి.గంగాధర్, ఎ.తిరుపతయ్య, రవీంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు. అవనిగడ్డ, కోడూరు మండలాల్లోని వి.కొత్తపాలెం, జయపురం, విశ్వనాథపల్లి మీదుగా కోడూరు చేరుకున్న సైకిల్ యాత్రలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రఘు, జిల్లా నాయకులు పోలాబత్తిన మోహనరావు, శీలం నారాయణరావు, వాకా రామచంద్రరావు, బండె ఆదిశేషు, యద్దనపూడి మధు, సిఐటియు నాయకులు ఎండి కరిముల్లా, కోడూరు మండల నాయకులు కొప్పనాతి తాతయ్య, కైలా యేసు పదం, రాజు, మేడంకి వెంకటేశ్వరరావు, బత్తిన రాజగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. నందివాడలో ముగిసిన యాత్రలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సంఘం జిల్లా కార్యదర్శి మురాల రాజేష్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి రవి, జిల్లా ఉపాధ్యక్షులు వై.నరసింహారావు, ఆర్‌సిపి రెడ్డి, నాయకులు మాజేటి శ్రీనివాసరావు, కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు బివి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, సిఐటియు నాయకులు సిహెచ్ జై రావు, డివైఎఫ్ఐ జిల్లా నాయకుడు బాజీ బాబు, వ్యకాసం నాయకులు పి ప్రభుదాస్, నందివాడ మండల నాయకులు ఎలీషా రావు తదితరులు పాల్గొన్నారు. ఈ యాత్ర జొన్నలగడ్డ, కుదమేరు వంతెన, పుట్టగుంట మీదుగా నందివాడ చేరుకుంది. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి యాత్రను ముగించారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిలో అవనిగడ్డ వెంకటేశ్వర టాకీస్ వీధిలో పాలు విక్రయించే పడమటి లక్ష్మణరావు (40) మరో మహిళ గోళ్ళ ర్యూన్సీ పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మరణించాడు. గాయపడిన వారిలో ముగ్గురిని మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నలుగురికి అవనిగడ్డ ఆస్పత్రిలో చికిత్స అందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

రామచంద్రాపురం సమీపంలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో కోడూరు మండలం విశ్వనాథ పల్లి గ్రామానికి చెందిన తండు వెంకటేశ్వరరావు అలియాస్ చింటూ (27) మరణించాడు. ద్విచక్ర వాహనంపై అవనిగడ్డ వైపు వెళుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. చింటూ తండ్రి కూడా గతంలోనే మరణించాడు. వెంకటేశ్వరరావు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉద్యోగం చేస్తూ వర్క్ ఫ్రమ్ హోంలో ఉన్నాడు. గతంలో భర్త చనిపోవడతోపాటు ఇప్పుడు చేతికొచ్చిన కొడుకు మరణించడంతో తల్లి రోదన వర్ణనాతీతంగా ఉంది. విశ్వనాథపల్లిలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎంఎల్ఎ సింహాద్రి పరామర్శ

విజయవాడ, అవనిగడ్డ ఆస్పత్రుల్లో క్షతగాత్రులను అవనిగడ్డ ఎంఎల్ఎ సింహాద్రి రమేష్ బాబు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మరణించిన లక్ష్మణరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. అవనిగడ్డ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని, మృతునికి కుటుంబాన్ని నాయకులు కడవకొల్లు నరసింహారావు పరామర్శించి సానుభూతి తెలిపారు.

విరివిగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

చేయాలన్నారు. జిల్లా కేంద్రం మచిలీపట్నంలో పోర్టు నిర్మాణం, హార్బర్ ఏర్పాటుతో జిల్లా రూపురేఖలు మారనున్నాయన్నారు. పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోర్టు అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ చేపట్టి ముందుగానే భూములను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పెద్దతరహా పరిశ్రమలు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలను ఏదో ఒకరోజున ఆకస్మాత్తుగా సందర్శిస్తానని, నిత్యం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లాలో ఉన్న మొత్తం పరిశ్రమల వివరాలు, వాటి విస్తీర్ణం, ఉద్యోగుల వివరాలతో సమగ్ర నివేదికను తనకు సమర్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల జీఎం ఆర్. వెంకట్రావ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కెఎస్ఎస్. సీతారామ్, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ప్రతాప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలపై దృష్టి

అధికారులకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : జిల్లాలో గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు అధికారులు నిర్దేశించిన లక్ష్యాల సాధనపై అధికారులు దృష్టి పెట్టాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాల పున ప్రారంభంనాటికి నాడు-నేడు పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జగనన్న గృహ నిర్మాణాలు, నాడు-నేడు పనుల ప్రగతి, స్పందన అర్జీల పరిష్కారంపై విజయవాడలోని కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలలో 10,904 గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటి వరకు 10,839 గృహాలను పూర్తయ్యాయని అన్నారు. మరో 123 గృహాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీలలో 9,242 మంది లబ్ధిదారులకుగాను 7,837 మందికి నీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. 7,838 మందికి విద్యుత్ కనక్షన్‌ను ఏర్పాటు చేశామని, మరో 1404 మందికి గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉందని అన్నారు. జిల్లాలో నిర్దేశించిన 16,347 గృహ నిర్మాణాలకు గాను ఇప్పటికే 10వేలకుపైగా గృహ నిర్మాణాలు పూర్తి చేసినట్లు చెప్పారు. వివిధ దశలలో ఉన్న 6 వేల గృహాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల లబ్ధిదారులకు కేటాయించిన లే అవుట్లలోని గృహ నిర్మాణాలను పూర్తి చేసేలా కార్యచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. నాడు నేడు పథకం కింద చేపట్టిన అదనపు తరగతి గదులు, ప్రహరి గోడలు, మరుగుదొడ్లు, వంట షెడ్ల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పూర్తి చేసి నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డిఆర్‌వో కె. మోహన్‌కుమార్, డిఆర్‌డిఎ పిడి కె. శ్రీనివాస్‌రావు, తిరువూరు ఆర్‌డిఓ వై విప్రసన్నలక్ష్మి, హౌసింగ్ పిడి రజనీ కుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ డి.వెంకట రమణ, హౌసింగ్ డిఇ రవికాంత్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి. మహేశ్వరరావు, జిల్లాకు చెందిన మండల స్పెషల్ ఆఫీసర్లు యంపిడివోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం 4వ

డివిజన్ గురునానక్ కాలనీ, కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీల్లోని పలు వీధులలో పారిశుధ్య నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. నగరంలో దోమలు బెడద లేకుండా లార్వా దశలో దోమల పెరుగుదలను నివారించే యాంటి లార్వా ఆపరేషన్ పనులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. నూరు శాతం డోర్ టు డోర్ బాస్కెట్ కలెక్షన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖాధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు మరియు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'రాగూర్'లో విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ : ఎంజి రోడ్డులోని రాగూర్ స్మారక గ్రంథాలయంలో సరస్వతీ సామ్రాజ్యం అధ్యక్షతన విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ ఉమ్మడి కష్ణాజిల్లా చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎపి గ్రంథాలయ పరిషత్ సభ్యులు మహేష్ పాల్గొన్నారు. మహేష్ గ్రంథాలయం లోని ప్రతీ విభాగాన్ని సందర్శించి, ప్రతి విభాగాన్ని క్షుణంగా పరిశీలించారు. విద్యార్థులతో వారు ఏ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారో ఆరా తీశారు. సౌకర్యాల గురించి ముచ్చటించారు. క్విజ్‌లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకం (మెడల్) బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి కె.రమా దేవి, గ్రేడ్ 2 జి.ఉమారాణి, గ్రేడ్ 3 వై.ధనలక్ష్మి, డి.రమేష్, రికార్డ్ అసిస్టెంట్ కె.రాంబాబు, గోపాలరావు, దుర్గాంబ, గంధం ర్యూన్సీ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

కృష్ణా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఆయన జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతి, లేఅవుట్లలో సమస్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన 93,245 గృహాలలో ఇప్పటి వరకు సుమారు 15 వేల గృహాల నిర్మాణం పూర్తయిందని, మరో 30 వేల గృహాల బేస్మెంట్ లెవెల్ కంటే పైస్థాయిలో ఉన్నాయని తెలిపారు. వివిధ దశల్లో ఉన్న మిగతా గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 699 లేఅవుట్లకుగాను, 287 లేఅవుట్లలో విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన లేఅవుట్లలో విద్యుదీకరణ పూర్తి చేయడానికి లైన్ మార్కింగ్, అప్రోచ్ రోడ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా లేఅవుట్లకు నీటి సరఫరా చేయాలని, ఇళ్ల నిర్మాణాలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు.

IN THE COURT OF THE II ADDL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.No.108/2023 in I.A.No.678/2009
in
O.S.No.1265/2006

Between:
Madapati Swobhagyamma ...Petitioner/Plaintiff
and
Medasani Tirupattamma and 10 Others ...Respondent/Defendent

1.D.Ramya, W/o Kishore, R/o.Iswarya Grand, 4th Floor, Flat No.406C, C-Block, Ibrahimpatnam(V) & Mandal, NTR District. **Respondent-10**

2.Jampala Raghuram, S/o Late Venkateswara Rao, R/o.Iswarya Grand, 4th Floor, Flat No.406C, C-Block, Ibrahimpatnam(V) & Mandal, NTR District. **Respondent-11**

పై నెంబరు గల Petition లో 10 and 11వ Respondents అయిన మీ హాజరు నిమిత్తం ది.01-05-2023న వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదిన 10and 11వ Respondent అయిన మీకు ఏ విధమైన అభ్యంతరములు ఉన్న యెడల మీరు గాని, మీ తరపు వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట ది.1-05-2023వ తేదిన ఉదయం 10-30ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు తదుపరి ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:1-05-2023

ఇట్లు
స॥రా నాగేశ్వరరావు,
న్యాయవాది, విజయవాడ.

IN THE COURT OF THE II ADDL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.No.109/2023 in I.A.No.678/2009
in
O.S.No.1265/2006

Between:
Madapati Swobhagyamma ...Petitioner/Plaintiff
and
Medasani Tirupattamma and 10 Others ...Respondent/Defendent

1.D.Ramya, W/o Kishore, R/o.Iswarya Grand, 4th Floor, Flat No.406C, C-Block, Ibrahimpatnam(V) & Mandal, NTR District. **Respondent-10**

2.Jampala Raghuram, S/o Late Venkateswara Rao, R/o.Iswarya Grand, 4th Floor, Flat No.406C, C-Block, Ibrahimpatnam(V) & Mandal, NTR District. **Respondent-11**

పై నెంబరు గల Petition లో 10 and 11వ Respondents అయిన మీ హాజరు నిమిత్తం ది.01-05-2023న వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదిన 10and 11వ Respondent అయిన మీకు ఏ విధమైన అభ్యంతరములు ఉన్న యెడల మీరు గాని, మీ తరపు వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట ది.1-05-2023వ తేదిన ఉదయం 10-30ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు తదుపరి ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:1-05-2023

ఇట్లు
స॥రా నాగేశ్వరరావు,
న్యాయవాది, విజయవాడ.

IN THE COURT OF THE II ADDL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A.No.107/2023 in I.A.No.678/2009
in
O.S.No.1265/2006

Between:
Madapati Swobhagyamma ...Petitioner/Plaintiff
and
Medasani Tirupattamma and 10 Others ...Respondent/Defendent

1.D.Ramya, W/o Kishore, R/o.Iswarya Grand, 4th Floor, Flat No.406C, C-Block, Ibrahimpatnam(V) & Mandal, NTR District. **Respondent-10**

2.Jampala Raghuram, S/o Late Venkateswara Rao, R/o.Iswarya Grand, 4th Floor, Flat No.406C, C-Block, Ibrahimpatnam(V) & Mandal, NTR District. **Respondent-11**

పై నెంబరు గల Petition లో 10 and 11వ Respondents అయిన మీ హాజరు నిమిత్తం ది.01-05-2023న వాయిదా అయి ఉన్నది. కావున సదరు వాయిదా తేదిన 10and 11వ Respondent అయిన మీకు ఏ విధమైన అభ్యంతరములు ఉన్న యెడల మీరు గాని, మీ తరపు వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట ది.1-05-2023వ తేదిన ఉదయం 10-30ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు తదుపరి ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:1-05-2023

ఇట్లు
స॥రా నాగేశ్వరరావు,
న్యాయవాది, విజయవాడ.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

గన్నవరం : స్రవంతి పాఠశాలలో కృష్ణాజిల్లాస్థాయిలో నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల్లో గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు డి.చందు, ఆర్.తేజేష్‌లు తమదైన నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిమ్మగడ్డ రవీంద్రభవాని తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు కృష్ణాజిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఆమె తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాల పిఇటి దనాల నాగరాజు క్రీడాకారులను అత్యుత్తములుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు.

60 మంది పేదలకు అన్నదానం

గుడ్లవల్లేరు : స్థానిక లయన్స్ సేవా భవనంలో బుధవారం గవర్నేని(సజ్జా) లలితకుమారి జ్ఞాపకార్థం వారి

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కుటుంబ సభ్యుల సహకారంతో 60 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంసెట్టి ఆదినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ సభ్యులు వైపిసి ప్రసాద్, వివి సుబ్బారావు చౌదరి, డి.రామకృష్ణ, వి రవీంద్ర, చాపరాల రాజా ఫణిగోపాల్, వరదామయ్య, సుబ్రహ్మణ్యేశ్వరరావు, చిట్టిబాబు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ అభినందనీయం : కమిషనర్

ప్రజాశక్తి-గుడివాడ

బాలికలు కుట్టు మిషన్ల ద్వారా కూడా లబ్ధిపొందాలనే ఉద్దేశ్యంతో మెగా లెజెండ్స్ సోషల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ద్వారా కుట్టు మిషన్లు అందించటం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎకెటిపి మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనేషన్ అధ్యక్షులు ఎన్.భీమేశ్వరరెడ్డి, కార్యదర్శి రెడ్డి మంగతాయార్, కోశాధికారి ఆర్‌డి ప్రసాద్, ఉపాధ్యక్షులు జి.సత్యనారాయణ, ఇంటర్నేషనల్ ఖో-ఖో రిఫరీ మదాక ప్రసాద్, ఉపాధ్యాయులు డి.చంద్రశేఖర్, ఎం.మహేశ్వరరావు, పిఇటి అనురాధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దళిత వ్యతిరేక విధానాలను వీడాలి : గోవర్దన్

అవనిగడ్డ : దళితులు తప్పు చేస్తే నేరం, ఇతరులు చేస్తే అది న్యాయం అన్నట్లుగా అవనిగడ్డ అధికార పార్టీ నేతల తీరు ఉంటోందని మాల మహానాడు జిల్లా కన్వీనర్ దోవా గోవర్దన్ విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాటాలాడారు. నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో దళితుల అణిచివేత విధానాలు అమలుపుతున్నట్లుగా ఉందన్నారు. ప్రస్తుత అధికార పార్టీ పెద్దల నుండి దిగువ స్థాయి కార్యకర్తల వరకు పలు సందర్భాల్లో దళితులపై కక్ష సాధింపు చర్యలు తీసుకోవడంలో అధికార పార్టీ వారు పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు

ఆర్ పేట పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

మచిలీపట్నం అర్బన్ : స్థానిక ఆర్‌పేట పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. స్టేషన్ ఎదుట పెడన మండలం కాకర్లమూడి గ్రామస్తులు, సర్పంచ్ నాగ కామేశ్వరరావును రూరల్ ఎస్ఐ చాణిక్య అవమానించారంటూ ఆందోళనకు దిగారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే మచిలీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చాణిక్యను బెదిరించిన కాకర్లమూడి గ్రామ టిడిపి సర్పంచ్ దౌర్జన్యం చేసి తిరిగి ఎస్ఐపై అసత్య ఆరోపణలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రేమ జంట వ్యవహారంలో సర్పంచి తల్లిదండ్రి ప్రియురాలుతో ప్రేమికుడికి ఫోన్లో పిలిపించి విచక్షణరహితంగా చితక్కొట్టినట్లు సమాచారం. పోలీసులు సర్పంచ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాకర్లమూడి సర్పంచ్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్ పేట పోలీస్ స్టేషన్ సిఐ రవికుమార్ తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

పవిత్ర రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీక అని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో ఇఫ్తార్ విందు ఏర్పాటు

ఇఫ్తార్‌విందులో పాల్గొన్న కలెక్టర్ పి.రాజాబాబు, పేర్ని నాని

చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ దైవారాధన, ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణ, దాతృత్వానికి రంజాన్ మాసం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలు సోదరభావం, ప్రేమను పెంపొందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ అల్లా అనుసరించిన మార్గంలో నడవాలన్నారు. మాజీ మంత్రి, మచిలీపట్నం శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ, రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలకు పెద్దపీట వేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, అదేబాటలో ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తొలుత మౌలానాలు ఖురాన్ పఠనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రంజాన్ మాసం విశిష్టతపై పలువురు వక్తలు ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితా సింగ్, డిఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఐ.కిషోర్, మచిలీపట్నం తహశీల్దార్ సునీల్ బాబు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి షమ్ సున్నీసా బేగం, మాజీ మునిసిపల్ ఛైర్మన్ షేక్ సలార్ దాదా, యువ నాయకులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), జామియా మసీద్ ఇమామ్ రఫీక్ అలం, మచిలీపట్నంలోని వివిధ మసీదుల కమిటీ అధ్యక్షులు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మేలో బందరు పోర్టు పనులు ప్రారంభం : జెసి

పజాశక్తి-మచిలీపట్నం రూరల్

వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి బందరుపోర్టు పోర్టు పనులు ప్రారంభిస్తారని, ఈలోగా సన్నద్ధత పనులు పూర్తిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ అధికారులను కోరారు. బందరు

రహదారుల మ్యాపును పరిశీలిస్తున్న జెసి

పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని బుధవారం ఆమె అధికారులతో సందర్శించి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పోర్ట్ అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా పోర్టు కనెక్టివిటీ రహదారి నిర్మాణ పనులు గురించి ఆరా తీశారు. ముడ మాస్టర్ ప్లాన్ పరిశీలించి, చేపట్టాల్సిన పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మిత ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రేక్ వాటర్ ప్రాంతం, డ్రెజ్జింగ్ ప్రాంతం, అప్రోచ్ ఛానల్ ఏరియా వరకు వెళ్లి పరిశీలించారు. టర్నింగ్ సర్కిల్ ఏరియా, ప్రతిపాదిత పైలాన్ ఏరియా, పోర్టు నిర్మిత ప్రాంతం మార్కింగ్, బౌండరీలు పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బందరు పోర్టు నిర్మాణానికి అవసరమైన భారీ యంత్రాలు, మెటీరియల్ తరలించటానికి అనువుగా పోర్టు కనెక్టివిటీ రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రహదారి పనులు ఇంకా వేగవంతం చేయాలని సూచించారు. పోర్టు నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన భారీ యంత్రాలను నిర్మాణ సంస్థ ఇప్పటికే తరలించిందన్నారు. ముఖ్యమంత్రి పోర్టు పనులు లాంఛనంగా ప్రారంభించగానే, నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. మేఘా ఇంజినీరింగ్ జనరల్ మేనేజర్ తులసీదాస్, రైట్స్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ సూర్య, బందరు తహశీల్దార్ డి.సునీల్ బాబు, రైట్స్ సంస్థ ప్రతినిధులు జెసి వెంట ఉన్నారు. అనంతరం రూరల్ మండలంలోని కర్రగ్రహారం లే అవుట్‌ను సందర్శించారు.

పలుచోట్ల 'మా నమ్మకం నువ్వే జగన్'

గుడివాడలో

గుడివాడ : స్థానిక 5వ వార్డులోని జగనన్నే మా నమ్మకం మా భవిష్యత్తు కార్యక్రమం సందర్భంగా వార్డు కన్వీనర్ వెంపల అప్పారావు, జోగా నాగేశ్వరరావు, ఆర్జా ప్రసాద్ అధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదో వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : బాపులపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని 7వ వార్డులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని రాష్ట్ర నాటక రంగ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ సరిపల్లి కమల బాయ్,ఎంపీపీ యరగొర్ల నగేష్, జెడ్పీటీసీ కోమరవల్లి గంగ భవాని,జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్ మూర్తి,వార్డు సభ్యులు చందు కనక దుర్గ మల్లీశ్వరి, గృహ సారధుల కన్వీనర్ తిమోతి, కోమరవల్లి థామస్, గృహ సారథులు చందు నరేంద్ర, నాగరాజు, ఇస్మాయిల్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటిని సందర్శించి మానమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్ అతికించి మొబైల్‌కు స్మాల్ స్టిక్కర్ ను వేయించి, వారి మొబైల్ నుండి మిస్డ్ కాల్ ఇచ్చి జగనన్న పరిపాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి పార్టీ ఇచ్చిన 5 ప్రశ్నలకు జవాబులు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో

గన్నవరం : చిక్కవరం గ్రామం, చింతగుంట, కొత్త దళితవాడ, పాత దళితవాడల్లో గ్రామ సర్పంచ్ అన్నే లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అన్నే లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ దుర్గాదేవి, గ్రామ కన్వీనర్ సిహెచ్ జోజి, సచివాలయ కన్వీనర్ పి. రవమ్మ, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీహరి కేసును విచారించాలి : బుద్ధప్రసాద్

అవనిగడ్డ : దివిసీమలో రెండేళ్ల క్రితం సంచలనం సృష్టించిన డాక్టర్ కె శ్రీహరిరావు హత్యపై వెంటనే గూగుల్ టేక్ అవుట్ పద్ధతి ద్వారా విచారణ చేసి నిందితులను గుర్తించాలని జిల్లా ఎస్పీ పి.జాషువాకు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన శ్రీహరిరావు హత్య కేసులో నేటికీ ఎలాంటి పురోగతి లేనందున దీనిపై విచారణ చేయాలని కోరారు. 2020 నవంబర్ 28న ఆయన దారుణ హత్యకు గురయ్యారన్నారు. 26 నెలలు క్రితం ఈ హత్య జరిగితే నేటి వరకు కేసును ఛేదించలేదని అసలు కేసు దర్యాప్తులో ఉన్నదో లేదో మూసేశారో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ శ్రీహరిరావును దొంగలు, వ్యాపార భాగస్వాములు, బంధువులు ఇలా ఎవరు హత్య చేశారో తెలియక ప్రజలు రకరకాలుగా ఊహాగానాలు చేస్తున్నారన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యలో ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానమైన గూగుల్ టేక్ అవుట్ పద్ధతి ద్వారా విచారణ చేసి హంతకులను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పది ఐసిడిఎస్ ప్రాజెక్టులలోని అంగన్ వాడి కేంద్రాల్లో 9 అంగన్ వాడీ కార్యకర్త పోస్టులు, 4 మినీ అంగన్ వాడి కార్యకర్త పోస్టులు, 42 అంగన్ వాడి సహాయకురాలు పోస్టులు రోస్టర్ అనుసరించి భర్తీ చేయటానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి ఎస్.సువర్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టులు అవనిగడ్డ ,బందర్ (రూరల్) .బందరు, పెడన, బంటుమిల్లి,పామరు,గుడివాడ, కంకిపాడు, మొవ్వ, గన్నవరం, ఉయ్యూరు ప్రాజెక్టుల్లో ఖాళీలు భర్తీ చేయనున్నామని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు సమీపంలోని సి డి పి ఓ కార్యాలయంలో సంప్రదించి మే 1 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవలసినదిగా కోరారు. అంగన్ వాడి కార్యకర్త, మినీ అంగన్ వాడి కార్యకర్త, అంగన్ వాడి సహాయకురాలు పోస్టులకు గాను అభ్యర్థులు 21 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలలోపు వారు సంప్రదించాలని కోరారు.

వీరవల్లిలో మజ్జిగ పంపిణీ

గన్నవరం (హనుమాన్ జంక్షన్) : బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో మమతల పందిరి ఫేస్ బుక్ ఏర్పాటుచేసి గత 22 నెలలుగా ఇప్పటికి 26 వినూత్న సేవలందిస్తున్న గ్రూప్ ఎడ్మిన్ లంక రమేష్ అభినందనీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండుటెండలను దృష్టిలో ఉంచుకొని బుధవారం వీరవల్లిలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయం వద్ద మమతల పందిరి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని లంక రమేష్ చేపట్టారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొని సేవా కార్యక్రమాల్లో తనదైన శైలిలో సేవలందిస్తున్న మమతల పందిరి ఫేస్ బుక్ గ్రూప్ మరిన్ని సేవా కార్యక్రమాలు అందించి పేద ప్రజలకు సహకరించాలన్నారు. సహకరించిన కృష్ణ సరోజం (చెన్నై), కేసినపల్లి రామారావు (వరంగల్), కామేపల్లి రాణి (హైదరాబాద్) వాస్తవ్యులకు లంక రమేష్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా అనిత, అడ్మిన్ లంక రమేష్, గుండపనేని ఉమా వర ప్రసాద్, ఎంపిటిసి అమృతపల్లి సూర్యనారాయణ, కలపాల నాని, లింగమనేని చిన్ని, కోడిబోయిన బాబీ, గుండపనేని సుబ్బారావు, మందాది రవీంద్ర, కూరపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. .

బిజెపిని గద్దె దింపే వరకు పోరాటం

గన్నవరం : దేశం అభివృద్ధి చెందాలంటే బిజెపిని గద్దె దింపాలని, దానికోసం ప్రజలంతా కలిసి రావాలని కోరుతూ బుధవారం గన్నవరంలో సిపిఎం నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు.

కరపత్రాలు పంపిణీచేస్తున్న నాయకులు

గన్నవరం జాతీయ రహదారిపై, ఆగిరిపల్లి రోడ్డులో జనాలకు కరపత్రాలు పంచి ప్రచారం చేపట్టారు. బిజెపి వల్ల దేశానికి కలిగే నష్టాలను వివరించారు. ఈనెల 23వ తేదీన గన్నవరం మూడు బొమ్మల సెంటర్లో జరిగే బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంకటేశ్వరరావు, మిరవ నాగేశ్వరరావు, సురగాని సాంబశివరావు, ఉదయ భాస్కర్ రావు, సర్దార్,సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రుణ సదుపాయం కల్పించాలి

బ్యాంకర్ల సమావేశంలో మేయర్, కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ

ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అర్హత ఆధారంగా రుణ సదుపాయం కల్పించడంలో బ్యాంకర్స్ సహకరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బ్యాంకర్స్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు రుణ సదుపాయం కల్పించుటలో బ్యాంకర్స్ ముందుకు రావాలని కోరారు. వై.ఎస్.ఆర్.టిడ్కో (హౌసింగ్) లోన్స్ రివ్యూ, జగనన్న తోడు, పి.యం.స్వానిధి లబ్దిదారులకు, పలు సంక్షేమ పథకములు, పేద ప్రజలకు అందజేసే అంశంలో అర్జీ దారుల అర్హత ఆధారంగా రుణ సదుపాయం కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి పనులకు కావాల్సిన రుణాలను సదరు లబ్దిదారులకు సక్రమంగా మంజూరుయ్యేందుకు

బ్యాంకర్లతో మాట్లాడుతున్న మేయర్, కమిషనర్

బ్యాంకర్స్ సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ సమావేశంలో యుసిడిపిఒ కే.శకుంతల, డిసిఒ ఆనంద్‌రావు, టిఇ ఫణి టిఇ మమత తదితరులు పాల్గొన్నారు.

బిబిఎ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-విజయవాడ: బెజవాడ బార్ అసోసియేషన్ (బిబిఎ) ఆధ్వర్యంలో రంజాన్ ఇఫ్తార్ వేడుకలు బుధవారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా బెజవాడ ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయ మూర్తి, విశిష్ట అతిథులుగా బార్ కౌన్సిల్ మెంబెర్స్ సూరా బత్తుల మల్లేశ్వరరావు, చలసాని అజయ్‌కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి బెజావాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.బి.సుందర్ అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జన్ను శ్రీధర్, జాయింట్ సెక్రటరీ నరహరిశెట్టి జ్యోతి , లైబ్రేరియన్ ఆకుల పాండురంగ విటల్, కోశాధికారి బత్తుల వెంకటేశ్వర్లు, లేడీస్ సెక్రటరీ పెనుమాల జయలక్ష్మి , స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పగడాల ఆంజనేయులు సీనియర్ న్యాయవాదులు చేకూరి శ్రీపతి, నరహరిశెట్టి నరసింహారావు, అబ్దుల్ మతీన్, ఎకె బాష, అబ్దుల్ రజాక్, మట్ట జయకర్,అబ్దుల్ షరీఫ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజధాని రైతులను సిఎం రోడ్డున పడేశారు

టిడిపి ఎంఎల్‌సి పంచుమర్తి అనురాధ

విజయవాడ: మూడు రాజధానులపై సిఎం జగన్ సమాధానం చెప్పాలని టిడిపి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో విశాఖ వచ్చి కాపురం ఉంటానని సిఎం ప్రకటించారన్నారు. విశాఖలో కాపురం పెట్టమని సిఎంకు పొలిటికల్ లాబీయిస్ట్ విజయ్‌కుమార్ చెప్పారా... విశాఖ శారదా పీఠం స్వరూపానంద ముహూర్తం పెట్టారా అని ఎద్దేవా చేశారు. రాయలసీమలో కాపురం పెట్టి ఇడుపులపాయలో అసైన్డ్ భూములు కొట్టేశారని, అమరావతిలో కాపురం పెట్టి రాజధాని రైతులను రోడ్డున పడేశారని, అమరావతిని పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు. భూములిచ్చిన రైతులను క్షోభ పెట్టారన్నారు. విశాఖ వెళ్లకముందే విజయసాయి, వైవీ సుబ్బారెడ్డిని అక్కడికి పంపారని, రూ.40 వేల కోట్ల విలువైన భూములు కబ్జా చేసేశారని, రుషికొండను బోడిగుండు చేశారని ఆరోపించారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసం, కబ్జాలు మినహా ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఏపీకి ఏకైక రాజధాని అమరావతి అని జగన్ తన నోటితోనే చెప్పే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. ఒక హత్య... లక్ష అబద్ధాలతో కాలం గడుపుతున్నారు. వివేకా హత్య కేసు వెబ్ సిరీస్‌ను తలపిస్తోందన్నారు.

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర పర్యటన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో 27వ వార్డులో మంగళవారం మున్సిపల్ చైర్మన రంగాపురం రాఘవేంద్ర పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి స్వయంగా ప్రజల్లో తిరిగి ప్రజల ద్వారా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి వస్తున్నారా? లేదా? సంక్షేమ పథకాలు అందించడంలో

సహాయపడుతున్నారా లేదా అని ప్రజల ద్వారానే తెలుసుకున్నారు. వార్డులోని ప్రధాన సమస్యలైన పైప్ లైన్లు, డ్రైనేజీ వ్యవస్థ, కరెంటు స్తంభాలు తదితర సమస్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. వీలైనంత త్వరగా సామినేని ఉదయభాను ఆలోచనలకు అనుగుణంగా జగ్గయ్యపేట పట్టణాన్ని అభివద్ధి పరుస్తామని, ప్రతి సమస్యను దూరం చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మోరె బాబి, చిరంజీవి పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లతో కాలేయం సురక్షితం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: ఆరోగ్యకరమైన అలవాట్లతో కాలేయాన్ని కాపాడుకోవచ్చని కామినేని హాస్పటల్స్ సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ వంశీ చైతన్య గూడే అన్నారు. తాడిగడపలోని కామినేని హాస్పటల్స్ నందు బుదవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 19వ ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా వివిధ అవగాహనా కార్యక్రమాలను తమ హాస్పటల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మెదడు తరువాత కాలేయం మన శరీరంలోని అతి పెద్ద అవయవం అన్నారు. మనం తినే, తాగే, వేసుకునే మందులు కూడా చివరకు కాలేయం గుండా ప్రయాణిస్తాయన్నారు. జీర్ణమైన ఆహార పదార్థాలు కరిగి కలసిపోయిన మందులతో కూడిన రక్తాన్ని జాగ్రత్తగా వడబోసే కాలేయం దానిలో ప్రమాదకర రసాయనాలను తొలగిస్తుందన్నారు. ఇన్ఫెక్షన్లతో పోరాడుతుందన్నారు. రక్తంలో చక్కెర శాతాన్ని క్రమబద్ధం చేసుతందని, కొలెస్ట్రాల్ శాతం అదుపు చేస్తుందన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వలన మంచి ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలిపారు. కాలేయ వ్యాధి లక్షణాల గురించి తెలుసుకోవడంతో పాటు ముందుగా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కామినేని హాస్పటల్స్ సీవోవో డాక్టర్ నవీన్ కుమార్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎన్.వి. పవన్ ఈశ్వర్ పలువురు వైద్యులు పాల్గొన్నారు.

మలబార్ బ్రైడల్ క్యాంపెయిన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మలబార్ గోల్డ్ అండ్‌డైమండ్స్ కొత్త ఆభరణాలను ప్రజలకు అందించేందుకు బ్రైడల్ క్యాంపెయిన్ ప్రారంభించినట్లు మలబార్ ఎం.జి.రోడ్డు షోరూమ్ మేనేజర్ నిఖిల్ చంద్రన్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని షోరూమ్‌లో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సందర్భంగా ఫ్లాగ్‌షిప్ బ్రైడల్ క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. క్యాంపెయిన్‌ను ప్రజలకు తెలియచేసేందుకు ఆలియాభట్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించి ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎప్పటికపుడు సరికొత్తగా ఆభరణాలను అందించేందుకు మలబార్ గోల్డ్ సంస్థ ముందుంటుందని తెలిపారు. ఇందులో భాగంగా సినీ తారలతో ప్రచార కార్యక్రమాలతో ప్రతి ఒక్కరి ముందుకు తమ ఆభరణాలను తీసుకువెళ్లి అందిస్తున్నామని తెలిపారు. మలబార్ సంస్థ ఆభరణాల ప్రేమికులకు మరింత చేరువకావడానికి విస్తరించే క్రమంలో సినీ తారలతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.



భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు

ఎన్‌టిఆర్ జిల్లా వ్యవసాయాధికారి నాగమణమ్మ

ప్రజాశక్తి-విజయవాడ: రైతులు వేసవిలో తమ భూములకు సంబంధించి భూసార పరీక్షలు నిర్వహించి ఫలితాలకు అనుగుణంగా పంటలను చేపట్టి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారిణి సాకా నాగమణమ్మ ఒక ప్రకటనలో కోరారు.జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 40 వేల హెక్టార్‌లో వరి, 44,134 హెక్టార్‌లో ప్రత్తి, 18,500 హెక్టార్‌లో మిరప, 22,500 హెక్టార్‌లో మామిడితో పాటు పుష్పజాతి పంటలు కూరగాయలను పండించడం జరుగుతుందన్నారు. సారవంతమైన భూములలో

పంటలను చేపట్టడం ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుందన్నారు. రైతులు తమ భూములకు సంబంధించి భూసార పరీక్షలను చేయించుకుని అనుగుణంగా పంటలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. భూసారాన్ని బట్టి అవసరమైన సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట, పైరులు దున్నడం ద్వారా భూమిని సారవంతం చేసుకోవాలన్నారు. సాగునీటి యాజమాన్య పద్ధతులు, వనరుల వినియోగం, భూసార పరీక్షలు, సేంద్రియ ఎరువుల వాడకం వంటి అంశాలపై రైతులు అవగాహన కలిగి వుండడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో భూసార పరీక్షలు - శిక్షణలను అందిస్తున్నామన్నారు. భూసార పరీక్షలపై డివిజన్, మండల, గ్రామ స్థాయి వ్యవసాయ అధికారులకు మట్టి నమూనాల సేకరణ భూసార పరీక్షల పై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రైతులకు సంబంధించి భూములు భూ సార పరీక్షలు నిర్వహించి వివరాలను జిపిఎస్ లోకేషన్ ద్వారా మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందన్నారు. గొల్లపూడిలోని భూసార పరీక్ష కేంద్రంతో పాటు జిల్లాలోని నాలుగు ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ లలో భూ సార పరీక్షలు నిర్వహించి ఫలితాలను తెలియజేసేందుకు చర్యలు తీసుకున్నామని రైతులు వారి పరిధిలోని వ్యవసాయ శాఖ సహాయకులను సంప్రదించి భూ సార పరీక్ష వివరాలను తెలుసుకోవచ్చునని నాగమణమ్మ ఆ ప్రకటనలో తెలిపారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: అషా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భముగా మంగళవారం పట్టణంలోని 100 మంది పేద ముస్లీం మహిళలకు చీర మరియు ఫిత్రా 100, కర్జురాలు కంపిణి చేశారు. ఈ కార్యక్రమములో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు లయన్ ఖాసిం సైదా, అధ్యక్షులు నజీర్ మీరా కార్యదర్శి జిలానీ , కోశాధికారి ఈనిషా బేగం, సభ్యులు కరిమా, సోహెల్, యాశల్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి జైలు

ప్రజాశక్తి-గంపలగూడెం: మండల కేంద్రమైన గంపలగూడెం గాంధీ సెంటర్లో 2015 సంవత్సరంలో ఎదురెదురుగా వస్తున్న మినీ వ్యాన్ మోటార్ బైకులు గుద్దుకున్నాయి. ఈ కేసు విచారణ అనంతరం బుధవారం తిరువూరు కోర్టు తీర్పు విలువరించినట్లు గంపలగూడెం ఎస్ఐ పి రాంబాబు తెలిపారు. ఈ కేసులో వినగడప గ్రామానికి చెందిన ముప్పాళ్ళ హరిబాబు మృతిచెందాడు. తిరువూరుకు చెందిన మినీ వ్యాన్ డ్రైవర్ బొల్లా నాగరాజుకు ఏడు నెలలు జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా తిరువూరు పిడిఎఫ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం శివకుమార్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై తెలిపారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

ప్రజాశక్తి-గంపలగూడెం: ప్రస్తుత వేసవిలో ప్రజలకు, పశువులకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గంపలగూడెం ఈవో గోగిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ డిల్లీరావు ఆదేశాల మేరకు గ్రామంలో గల ఎర్ర చెరువు, నల్లచెరువులను పూర్తిస్థాయిలో నింపినట్లు తెలిపారు. దీనితో పశువులకు, ప్రజలకు త్రాగునీటి సమస్య రాదన్నారు. చెరువుల తూములు ఎవరైనా ఏ పరిస్థితుల్లోనైనా తీసినట్లైతే తగిన చర్యలు చేపడతామని కృష్ణారెడ్డి వివరించారు.

నేడు రమేష్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం: విజయవాడకు చెందిన ప్రముఖ డాక్టర్ రమేష్ హాస్పటల్ ఆధ్వర్యంలో రమేష్ స్పెషాలిటీ క్లినిక్ మైలవరంలో గురువారం ప్రముఖ డాక్టర్ వెంకటరామిరెడ్డి చే ప్రారంభిస్తున్నట్లు రమేష్ హాస్పటల్ యాజమాన్యం బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ దినేష్ రెడ్డి,డాక్టర్ జి.హరిప్రసాద్ హాజరవుతున్నట్లు వారి పేర్కొన్నారు. గుండెకు సంబంధించిన వైద్య నిపుణులు అందుబాటులో ఉండనున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.